క్లుప్తంగా

ఆర్వో ప్లాంట్ల తనిఖీ



కొత్తపల్లి మినరల్ వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని జి.వీరాపురం, కొత్తపల్లిలోని ఆర్వో ప్లాంట్లను ఎంపీడీఓ మేరి బుధవారం ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ జుబేర్‌తో కలిసి తనిఖీ చేశారు. వాటర్ ప్లాంట్ల వద్ద పరిసరాలను పరిశీలించి ట్యాంకుల నిర్వహణ, క్లోరినేషన్ తదితర అంశాలను తనిఖీ చేశారు. ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన నీటిని అందించాలని నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ పార్థసారథి, పంచాయతీ కార్యదర్శి చాందిని ఉన్నారు.

సమయపాలన పాటించండి

- డీఎం అండ్ హెచ్‌ఓ వెంకటరమణ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

బండి ఆత్మకూరు: సమయ పాలన పాటించాలని డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి సూచించారు. బుధవారం బి.కోడూరు గ్రామంలో జరుగుతున్న 104 వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటుచేసిన మందులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ పీహెచ్‌సీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. డాక్టర్ భావన రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

వెలుగోడు: పట్టణంలోని లక్ష్మీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు సుప్రభాత సేవ, గోపూజ, విశ్వక్ సేన ఆరాధన, పుణ్యాహవాచన, నవ కలశస్థాపన, మూలమంత్ర హోమం, సుదర్శననరసింహ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బల్లాని వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో సాయంత్రం లక్ష్మీప్రసన్న వెంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం



నూతన మండల అధ్యక్షుడు ప్రభాకర్‌ను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా ప్రభాకర్, ఉపాధ్యక్షురాలిగా నాగమణి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ట్రెజరర్ నాగార్జునరెడ్డిలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు ప్రభాకర్‌ను పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు.

నూతన పైపుల ఏర్పాటు



బోరు మోటారుకు నూతన విద్యుత్‌తీగ, పైపు మారుస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో జీఎల్ఎస్ఆర్ ట్యాంకు వద్ద తుప్పు పట్టిన పైపులపు తొలగించి నూతన పైపులను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సర్పంచు వరప్రసాదరావు మాట్లాడుతూ ఏళ్ల క్రితం వేసిన పైపులు కావడంతో తుప్పు పట్టాయన్నారు. నీటి సరఫరా సమయంలో చిలుము వాసన వస్తుండటంతో బోరు వద్ద విద్యుత్ తీగలు, పైపులు కొత్తవి ఏర్పాటు చేశామన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలి

నందికొట్కూరు: అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. బుధవారం పార్టీ నాయకులు రఘురామ్మూర్తి, రజితమ్మ, పోచయ్య, వెంకటరమణతో కలిసి ఆయన డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరిదేవికి వినతి పత్రం అందజేశారు.

జీలుగ సాగు...
భూసారం బాగు

- తొలగనున్న చీడపీడల బెడద. • తక్కువ పెట్టుబడులు అధిక దిగుబడులు సాధ్యం

ఇబ్బడిముబ్బడిగా రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోతోంది. పంటల దిగుబడులూ అంతంతమాత్రంగానే వస్తున్నాయి. అవి కూడా విషతుల్యమవుతూ మానవ జీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అందుకే రసాయన ఎరువులకు స్వస్థి చెప్పి పచ్చిరొట్ట (జీలుగు) ఎరువుల సాగుతో భూసారాన్ని పెంచుకుని సేంద్రియ ఎరువులతో పంటల పండించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. – జూపాడుబంగ్లా



పొలంలో సాగుచేసిన పచ్చిరొట్ట ఎరువు(జీలుగ)ను చూపిస్తున్న రైతు

జీలుగ విత్తనాలను చిన్నపాటి వర్షం కురిసిన వెంటనే ఎకరాకు 12 నుంచి 16 కిలోలు (పచ్చిరొట్ట) చల్లుకోవాలి. విత్తనాలు మొలకెత్తి పూతదశకు వచ్చిన సమయంలో 8 నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుంది. ఓ టన్ను పచ్చిరొట్ట ఎరువులో సుమారు 6 కిలోల నత్రజని, 1–1.5కిలోల భాస్వరం, పొటాష్ లభిస్తాయి. ట్రాక్టర్‌తో జీలుగను పొలంలో కలియదున్నాలి. తర్వాత ఎకరాకు 50 కిలోల చొప్పున సూపర్‌పాస్ఫేట్ చల్లుకోవాలి. దీంతో దున్నేసిన జీలుగ పూర్తిగా కుళ్లిపోయి పొలం సారవంతమవుతుంది. మాగాణి పొలంలో అయితే పూర్తిగా కుళ్లిపోయిన తర్వాత వరి పంటను సాగుచేసుకోవాలి.

జీలుగ సాగు వల్ల ప్రయోజనాలు

- భూమి భౌతిక, జీవ, రసాయన లక్షణాలు వృద్ధి చెందుతాయి. తక్కువ ఖర్చుతో నేలకు సేంద్రియ పదార్థాన్ని అధిక మోతాదులో అందించవచ్చు. తద్వారా నేలకు నీటిని, పోషకాలను నిల్వచేసుకునే సామర్థ్యం పెరుగుతుంది.
- నేల గుల్లబారి గాలి ప్రసారం పెరగటంతో పాటు మురుగునీటి వ్యవస్థ పెరుగుతుంది. సేంద్రియ పదార్థం నేలకు అందటం వల్ల నేలలో సూక్ష్మ జీవులు వృద్ధిచెంది అనేక రసాయన చర్యలు జరిగి జింక్, మాంగనీసు, ఇనుము, క్యాల్సియం వంటి సూక్ష్మధాతువులు పంటకు అందేలా చేస్తాయి.
- పచ్చిరొట్ట ఎరువుల వల్ల రసాయనిక ఎరువులను తగ్గించి వాడుకోవచ్చు. రసాయనిక ఎరువులు వినియోగించకపోయినా 75 శాతం నత్రజని లభిస్తుంది.
- నేలకు సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి దోహదపడుతుంది. పొలంలో కలుపు మొక్కల వృద్ధిని అడ్డుకుని పంటల దిగుబడికి దోహదపడుతుంది.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లిపెసర సాగుకు అవసరమైన విత్తనాలను రైతులకు రాయితీపై రైతుసేవా కేంద్రాల్లో అందజేస్తారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకొని పొలాల్లో సాగుచేసుకోవటం వల్ల పంటలసాగుకోసం పెట్టుబడులు తగ్గించుకోవటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతం



పంటల సాగుకు నెలరోజులు ముందుగా పంటపొలాల్లో పచ్చిరొట్ట ఎరువులను సాగుచేసుకోవటం వల్ల భూసారం పెరిగి పంటలకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాషియంతో పాటు సూక్ష్మధాతువుల శాతం పెరుగుతుంది. తద్వారా పంటలకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాసియంతో పాటు సూక్ష్మధాతువులు పంటలకు సకాలంలో అంది దిగుబడులు పెరుగుతాయి. పంటలసాగు కోసం పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చు.

– కృష్ణారెడ్డి, ఏఓ, జూపాడుబంగ్లా

నేటి నుంచి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

మహానంది: పచ్చిరొట్ట విత్తనాలు(జీలుగ) గురువారం నుంచి పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం బుక్కాపురంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ మాట్లాడారు. మండలానికి 330 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను కేటాయించినట్లు చెప్పారు. క్వింటా పూర్తి ధర రూ.12,300 కాగా సబ్సిడీ 50 శాతం పోనూ రూ.6,150 రైతు చెల్లించాలన్నారు. ఎకరాకు పది కిలోల చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాల వరకు ఇస్తామన్నారు.

కౌలుకార్డులు తీసుకోవాలి

కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు పొందాలని ఏఓ నాగేశ్వరరెడ్డి సూచించారు. ఇతర రైతుల పొలాలు సాగు చేసే రైతులు సీసీఆర్ కార్డులు పొందితే అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట నష్టపరిహారం, కనీస మద్దతు ధర తదితర వ్యవసాయ పథకాలకు అర్హులవుతారన్నారు.

అబ్బీపురంలో పదహారు రోజుల పండుగ

మహానంది: అబ్బీపురం గ్రామంలో గత నెల 29, 30వ తేదీల్లో పెద్దమ్మ దేవర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం పదహారు రోజుల పండుగ వైభవంగా చేపట్టారు. మహిళలు వారి ఇళ్ల వద్ద నుంచి బోనాలు తీసుకొచ్చి పెద్దమ్మ తల్లికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణం వద్ద గ్రామ ప్రజలకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

వ్యవసాయాధికారుల సలహాలు పాటించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ రాజశేఖర్

బండి ఆత్మకూరు: వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నంద్యాల వ్యవసాయ శాఖ ఏడీ రాజశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ముందస్తుగా వరి నాట్లు వేసుకునేలా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండలానికి కేటాయించిన మట్టి నమూనాలను త్వరితగతిన సేకరించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. గ్రామాల్లో పొలం లేని రైతులు, కౌలుకు తీసుకున్న రైతులను గుర్తించి కౌలు కార్డుల ద్వారా కలిగే లాభాలను వివరించాలన్నారు. అర్హులైన కౌలు రైతులు స్థానిక వీఆర్వో వద్ద కౌలు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కౌలు గుర్తింపు కార్డులతో ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి

ఆత్మకూరు: కౌలు గుర్తింపు కార్డులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. కరివేన, నల్లకాల్వ గ్రామాల్లో బుధవారం కౌలు రైతులకు అవగాహన సభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రైతుల నుంచి పొలం కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్న రైతులు రెవెన్యూ అధికారులను సంప్రదించి కౌలు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. కార్డు ద్వారా సబ్సిడీపై విత్తనాలు, అన్నదాత సుఖీభవ, పంట నమోదు, పంటలబీమా, పంట నష్టపరిహారం, పంట రుణాలకు అర్హులన్నారు. కార్యక్రమంలో

కౌలు కార్డులు పొందండి

పగిడ్యాల: భూములు కౌలుకు సాగు చేసే ప్రతి రైతు కౌలు గుర్తింపు కార్డు పొందాలని గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ) వివేక్, వీఆర్వో రాఘవేంద్ర సూచించారు. బుధవారం పాత ముచ్చుమర్రి రైతు భరోసా కేంద్రం వద్ద కౌలు కార్డుల ఉపయోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాత ముచ్చుమర్రి వీఏఏ పుష్పావతి ఉన్నారు.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు



గిరిజనులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసిన వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరు: ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయొద్దని బైర్లూటీ పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్ గిరిజనులకు సూచించారు. మండలంలోని అమలాపురం చెంచుగూడెంలో బుధవారం గిరిజనులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎండల్లో ఎక్కువ దూరం నడిచి వెళ్లకూడదన్నారు. ఉదయం 10 గంటల్లోపే ఉపాధి పనులు, నిత్యావసర సరుకులు తదితర పనులన్నీ పూర్తి చేసుకోవాలన్నారు. జ్వరాల బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. అనంతరం గిరిజనులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బైర్లూటీ సీహెచ్‌ఓ ఉద్రూష్‌బాషా పాల్గొన్నారు.

భూములు కాపాడుకోవటం తెలియదా?

- తంగడంచ ఫారం అధికారులపై ఆత్మకూరు ఆర్డీఓ ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి

జూపాడుబంగ్లా: తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రంలో విధులు నిర్వహిస్తే సరిపోదు భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడుకోవాలని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి ఫారం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫారం అధికారుల ఫిర్యాదు మేరకు ఆక్రమణకు గురైన ఫారం భూములను బుధవారం ఆర్డీఓ పరిశీలించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ, ఫారం ఏఓలతో సమావేశం నిర్వహించి ఆక్రమణకు గురైన ఫారం భూముల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె ఆక్రమణలను స్వయంగా పరిశీలించారు. కర్నూలు–గుంటూరు రహదారి వెంట క్వార్టర్స్ నుంచి జూపాడుబంగ్లా వరకు ఆక్రమించుకుని ఏర్పాటుచేసుకున్న షెడ్లను అధికారులు ఆర్డీఓకు చూపించారు. ఆలయ నిర్మాణం కోసం ఏర్పాటుచేసిన శ్రీకృష్ణుని విగ్రహాన్ని, ముస్లింలు నిర్మించుకున్న మసీదును, ఎస్సీలు కమ్యూనిటీ హాలు కోసం ఏర్పాటుచేసిన బోర్డును ఫారం ఏఓలు కిశోర్, తేజశ్వరీదేవి, నిర్మల ఆర్డీఓకు చూపించారు. పోలీసుల సహకారంతో ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్, ఎంపీడీఓలను ఆర్డీఓ ఆదేశించారు. ముస్లింలను పిలిపించి ఫారం భూముల్లోంచి మసీదు నిర్మాణాన్ని తొలగించాలని ఆదేశించారు. షాదీఖాన కోసం కేటాయించిన 28 సెంట్ల స్థలంలో మసీదు నిర్మించుకోవాలని సూచించారు. అనంరతం ఆర్డీఓ నాగజ్యోతి మాట్లాడుతూ అనుమతుల్లేకుండా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆమె వెంట డీటీ సత్యదీప్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో పడి వ్యక్తి మృతి

మహానంది: మొక్కలకు నీళ్లు పడుతూ ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి గాజులపల్లెకు చెందిన మంటునూని మహ్మద్ కాశీం(47) బుధవారం మృతిచెందాడు. ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపిన వివరాలు.. మహ్మద్ కాశీం భార్య రహమ్మద్‌బీతో కలిసి బుక్కాపురం సమీపంలోని నంది ఫామ్ హౌస్‌లో మొక్కలకు నీళ్లు పట్టే పనిలో చేరారు. చెట్లకు నీళ్లు పోసే క్రమంలో కాశీం స్విమ్మింగ్ పూల్‌లో పడ్డాడు. అదే సమయంలో మూర్ఛ వ్యాధి రావడంతో బయటకు రాలేక మృతిచెందాడు. సూపర్‌వైజర్ వెంకటరెడ్డి గుర్తించి మృతుడి భార్యకు సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ.. తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

వెలుగోడు: టెన్త్, ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు యాదవ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు యాదవ సంఘం నాయకులు ఎస్ రఘురాముడు యాదవ్, నాగేశ్వరావుయాదవ్, శ్రీనివాసులు యాదవ్ తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన యాదవ విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. 10వ తరగతిలో 450 మార్కులు, ఇంటర్‌లో 800 మార్కుల పైన సాధించిన వెలుగోడు మండల యాదవ విద్యార్థులు మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను రఘురాముడు యాదవ్(6305724636), నాగేశ్వరరావు యాదవ్(9885866816)లకు, ఆత్మకూరు మండల విద్యార్థులు మన్నెం బాలస్వామి(7306999001)లకు, బండిఆత్మకూరు విద్యార్థులు రమేష్ (9963775546), మహానంది మండల విద్యార్థులు బాలకృష్ణ(8639967804)లకు ఈనెల 20వ తేదీలోపు అందజేయాలన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఎస్ఈకి సమస్యను విన్నవిస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

నందికొట్కూరు: హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్–1 పరిధిలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కే.నాగేంద్రప్ప, బంగి శ్రీధర్, నందికొట్కూరు నియోజకవర్గ అధ్యక్షులు, ఏపీవీఆర్వోల అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిని నరసరాజులు కోరారు. బుధవారం వారు స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్–1 ఎస్ఈ పాండురయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్–1 నందికొట్కూరు కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కృష్ణమూర్తి సీనియారిటీ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎస్ఈని కలిసిన వారిలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నందికొట్కూరు తాలూకా కోశాధికారి పి.రాముడు, ఉపాధ్యక్షులు యు.కృష్ణమూర్తి, ఎన్‌టీపీఏ సత్యనారాయణ ఉన్నారు.

విద్యుత్ చార్జీలతో ప్రజలపై అధిక భారం

నందికొట్కూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలును పెంచి సామాన్యులపై భారం మోపిందని ఎస్ఎఫ్‌యూఐ పట్టణ అధ్యక్షుడు సాయికుమార్ యాదవ్ ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి రాగానే పెంచి ప్రజలను మోసం చేశారన్నారు.

మల్లన్న సేవలో జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి



మల్లన్న దర్శనానికి వెళ్తున్న జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి జి.శ్రీనివాస్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి జి.శ్రీనివాస్(ఐఏఎస్) దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. బుధవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి జి.శ్రీనివాస్‌కు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శికి వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటాం

- జెరూషలేం శాల ఇన్‌చార్జ్‌లు యాకోబు, అజయ్‌వర్మ



మాట్లాడుతున్న జెరూషలేం శాల ఇన్‌చార్జ్‌లు

పాములపాడు: నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా భూ సేకరణ ఇష్టారీతిన చేసిన విషయంపై కోర్టు తీర్పునకు కట్టుబడి ఉంటామని జెరూషలేం శాల ఇన్‌చార్జ్‌లు యాకోబు, అజయ్‌వర్మ అన్నారు. బుధవారం మండలంలోని రుద్రవరం గ్రామ సమీపంలోని జెరూషలేం శాల వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్‌హెచ్ నిర్మాణం కోసం 2018లో ప్రార్థనా మందిరం ఉన్న స్థలం 448ఎతో పాటు 448బీ సర్వే నెంబర్‌లో భూ సేకరణ చేస్తున్నట్లు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. అయితే ఇప్పుడు కేవలం 448ఎ సర్వే నెంబరులో మాత్రమే భూ సేకరణ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లతో పాటు క్షేత్ర స్థాయి అధికారులను అడిగిగా ఎలాంటి సమాధానం ఇవ్వకపోగా, తమకు నోటీసులు ఇవ్వకుండా ప్రహరీని కూల్చారని వాపోయారు. న్యాయస్థానం పట్ల గౌరవం ఉందని, నేషనల్ హైవే నిర్మాణానికి వ్యతిరేకం కాదన్నారు. చర్చిని కూల్చడానికి అధికారులు, పోలీసులు ఎందుకు అంత చొరవ చూపుతున్నారో అర్థం కావడం లేదన్నారు. సమావేశంలో సంఘస్తులు విజయ్, శ్రీను, నెహమ్యా, లింగస్వామి, కర్నాకర్, నాగరాజు, ఏసేపు, ప్రసాద్ పాల్గొన్నారు.

పోలవరంపై ఉన్న శ్రద్ధ శ్రీశైలం ప్రాజెక్టుపై లేదు



కరపత్రాలను విడుదల చేస్తున్న బొజ్జా, రైతు సంఘం నాయకులు

మహానంది: రాష్ట్రప్రభుత్వానికి పోలవరంపై ఉన్న శ్రద్ధ.. శ్రీశైలం ప్రాజెక్టుపై లేదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ఆరోపించారు. సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన వార్షికోత్సవం సందర్భంగా ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం మహానంది మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ 2009లో వచ్చిన వరదలకు శ్రీశైలం ప్రాజెక్ట్ ప్లంజ్ పూల్ దెబ్బతిందన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌కు వెలుగులు పంచిన శ్రీశైలం ప్రాజెక్ట్ భద్రతను పట్టించుకోకుండా గాలికి వదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా రెండు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి స్పందించి యుద్ధ ప్రాతిపదికన భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ గ్రామాల్లో పర్యటించి ప్రజా బహిరంగ సభకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమలో వైఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, సాగేశ్వరరెడ్డి, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోజూ నాలుగు వేల మందికి పని కల్పించాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య

నందికొట్కూరు: మండల వ్యాప్తంగా ప్రతి రోజూ 4 వేల మంది శ్రామికులకు పని కల్పించాలని డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య సూచించారు. మిడుతూరు ఎంపీడీఓ సమావేశ భవనంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీ, ఏపీఓలతో ఉపాధి హామీ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఫాంపాండ్స్, కంపోస్ట్ పిట్స్, పశువుల నీటి తొట్లు, పండ్లతోటల పరిశ్రమల కింద వంద ఎకరాలు గుర్తించాలని అధికారులకు సూచించారు.

ఎండకు ఎండి.. వానకు తడిసి!

- నిరుపయోగంగా ఉన్న విలువైన యంత్రాలు



తుప్పు పట్టిన నూర్పిడి యంత్రం



నిరుపయోగంగా వడ్లు నూర్పిడి యంత్రాలు

జూపాడుబంగ్లా: తంగడంచ ఫారంలో సాగుకు ఉపయోగించే విలువైన యంత్రాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. చిన్నపాటి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాల్సిన ఫారం అధికారులు వాటిని అరు బయటే పడేయడంతో వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ ఎండుతూ తుప్పుపట్టిపోతున్నాయి. దీంతో ఫారంలోని 230 ఎకరాల్లో ఉత్పత్తి చేసిన కందులను మరోచోట డబ్బు వెచ్చించి యంత్రాలతో అధికారులు సీడ్‌ప్రాసెస్ చేయిస్తుండటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించడమో, లేదా వేలంవేసి వాటి ద్వారా వచ్చిన డబ్బుతో కొత్త యంత్రాలు కొనుగోలు చేయాలని పలువురు సూచిస్తున్నారు.



విత్తనాలు శుద్ధి యంత్రాలు